సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 9 । మే । 2025



సోలార్ విద్యుత్‌ను..

ప్రజలు తమ ఇళ్లపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 10లో ▸



అసంపూర్తిగా..

నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.3 /21.1

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బందులు కలగొద్దు



రాజంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ సూచించారు. ఆర్గోండ పీఏసీఎస్ పరిధిలోని కొండాపూర్, ఎల్లరెడ్డిపల్లి, సంతాయిపేట్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. సెంటర్లలో రైతులకు తాగునీరు, టార్పాలిన్లు, మౌలిక సదుపాయాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలపై తప్పకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని సూచించారు. ఆయనవెంట మానిటరింగ్ ఆఫీసర్ మసియొద్దీన్, సెక్రెటరీ సాయిలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: రెవెన్యూ శాఖలోని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి సహాయపడేందుకు రాష్ట్రంలో దాదాపు 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హతలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన సర్వేయర్లకు ఈ నెల 26 నుంచి జూలై 26వ తేదీ వరకు వరకు 50 పని రోజుల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజ్‌భవన్‌లో పిట్లం విద్యార్థులు



పిట్లం(జుక్కల్): ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పిట్లంకు చెందిన బ్లూబెల్స్, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మార్చి నెలలో నిర్వహించిన జాతీయ రెడ్ క్రాస్ క్యాంప్‌లో తెలంగాణ నుంచి ఎనిమిది మంది జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకోగా, ఆ బృందంలో పిట్లంకు చెందిన విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, రెడ్ క్రాస్ స్టేట్ వైస్ చైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మంజీర నుంచి రైతులు స్వయంగా వేసుకున్న పైప్‌లైన్‌లు

నీళ్లెత్తిపోయని పథకం

- రూ.కోట్లు వెచ్చించి నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- పథకంపై ఆశలు వదులుకున్న రైతులు
- రూ.లక్షలు వెచ్చించి సొంతంగా పైపులైన్‌ల ఏర్పాటు
- చించొల్లిలో వృథాగా మారిన ఎత్తిపోతల పథకం

బాన్సువాడ : మంజీర పరీవాహక ప్రాంతంలోని వ్యవసాయ భూములకు సాగునీరందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యం నీడలో ఉంది. బీర్కూర్ మండలం చించొల్లిలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నేడు వృథాగా మారింది. ఈ ఎత్తిపోతల పథకంపై గంపెడాశలు పెట్టుకున్న రైతులు చేసేది లేక రూ.లక్షలు ఖర్చు చేసి సొంతంగా వ్యవసాయ భూముల్లోకి పైప్‌లైన్‌లు వేసుకున్నారు. చించొల్లి మంజీర ప్రాంతంలో 2016లో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా రూ.4.9 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకం కింద 440 ఎకరాల ఆయకట్టు ఉంది. చించొల్లి గ్రామానికి చెందిన 188 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రారంభించిన రెండేళ్లపాటు బాగానే పని చేసిన పథకం.. ఆ తరువాత మోటార్లు కాలిపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. పంటలు చేతికొచ్చే సమయానికే



మోటార్లు కాలిపోవడంతో 20 మంది రైతులు కలిసి ఒక్కొక్కరు రూ.2 లక్షలు ఖర్చు చేసి మంజీరలో బోర్లు వేసి అక్కడి నుంచి పంట భూములకు యంత్రాల ద్వారా కాలువలు తవ్వి పైపులైన్‌లు వేసుకున్నారు. ఆ పైప్‌లైన్‌ల ద్వారా సుమారు 150 ఎకరాల వరకు నీరందేలా చేశారు. మిగతా భూములు రబీలో పడావుగా మారుతున్నాయి.

బోర్లు, చెరువుల ద్వారా..

మోటార్లు పని చేసేందుకు ప్రారంభంలో పథకం భవనం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మంజీరలో నాలుగు ఊట బావులను తవ్వి 10 మోటార్ల వరకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. సుమారు కిలోమీటర్ దూరం నుంచి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో లో ఓల్టేజీ సమస్య ఉత్పన్నమైంది. దీంతో ప్రతి సీజన్‌కు మోటార్లు కాలిపోతున్నాయని రైతులు అంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకం మోటార్లు బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

సొంతంగా పైప్‌లైన్‌లు వేసుకున్నాం



మా శివారులో 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఎత్తిపోతల పథకంపై ఆధారపడి వ్యవసాయం చేసేవాళ్లం. ఎత్తిపోతల పథకం మూత పడడంతో చేసేదేమీ లేక మంజీరలో బోరుబావులను తవ్వి రెండు కిలోమీటర్ల మేరకు పైపులైను వేయించుకున్నాను. ప్రస్తుతం మంజీరలో ఉన్న నీటి ద్వారా రెండు పంటలు పండించుకున్నాను.

– గోవింద్‌రెడ్డి, రైతు, చించొల్లి

సాగర్ నీళ్లు రాకుంటే భూములన్నీ పడావే



రబీలో నిజాంసాగర్ నీరు విడుదల చేయడంతో వ్యవసాయ భూముల్లో పంటలు పండిస్తున్నాం. సాగర్ నీళ్ల లేకుంటే భూములన్నీ పడావుగా మారేవి. చాలా మంది రైతులు మంజీర నుంచి సొంతంగా ఖర్చు చేసి పైపులైన్‌లు వేసుకుని పంటలు పండించుకున్నారు.

– పెర్క అంబయ్య, రైతు, చించొల్లి

పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు



అదనపు కలెక్టర్ చందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- 'సాక్షి' ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై ఏపీ ప్రభుత్వం వేధింపులు
- జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల నిరసన

కామారెడ్డి టౌన్: 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసుల వేధింపులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు గురువారం నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటని సీనియర్ జర్నలిస్టులు వేణుగోపాలచారి, రజనీకాంత్, శ్రీనివాస్ తదితరులు మండిపడ్డారు. సాక్షి ఎడిటర్‌పై దాడి, అక్రమ కేసులు, ఆయన ఇంట్లో సోదాలు పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టుఅని అన్నారు. కక్షపూరితమైన చర్యలను మానుకోనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పట్నం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆబీద్, అర్షద్, వెంకటేశ్, రాజేశ్, రమేశ్, సంగరాజు, అన్వర్, ప్రభు, సురేశ్, కాసర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో జిల్లాకు అవార్డు


కామారెడ్డి క్రైం: జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను లక్ష్యానికి అనుగుణంగా మంజూరు చేయడంతో 2024 – 25 సంవత్సరానికి కామారెడ్డి జిల్లాకు అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్డీవో సురేందర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న డీఆర్డీవో సురేందర్

పెళ్లయిన తొమ్మిది నెలలకే..

- నక్సల్స్ చేతిలో బలైన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్
- పాల్వంచ మండల కేంద్రంలో విషాదం



వడ్ల శ్రీధర్ (ఫైల్)

మాచారెడ్డి : పోలీసు ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో డిగ్రీ పూర్తవగానే కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే ప్రత్యేక పోలీస్ ఏఆర్ బెటాలియన్‌లో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ అధికారుల మన్ననలు పొందాడు. విధి నిర్వహణలో భాగంగా కూంబింగ్‌లో పాల్గొనగా నక్సల్స్ పేల్చిన మందుపాతరకు బలయ్యాడు. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీధర్ (30) ములుగు జిల్లా పేరూరు పోలీసు స్టేషన్ పరిధిలో వాజేడు ఏరియాలో గురువారం ఉదయం నక్సలైట్లు మందుపాతర పేల్చడంతో ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే.. పేద కుటుంబంలో జన్మించిన శ్రీధర్ చదువులో చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. కామారెడ్డిలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత 2020లో టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే ఏఆర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అక్కడే శిక్షణ పూర్తి చేసుకున్న శ్రీధర్ రెండేళ్ల కిందట గ్రేహౌండ్స్ విభాగంలోకి వెళ్లాడు. హైదరాబాద్ కేంద్రంగా గ్రేహౌండ్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. తల్లి లక్ష్మి, భార్య శ్రీవాణితో కలిసి అక్కడే ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. నక్సల్స్ ఏరివేతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ చేపట్టాయి. గ్రేహౌండ్స్ బృందంతో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సల్స్ మందుపాతర పేల్చడంతో శ్రీధర్ మృతిచెందినట్టు పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. కాగా శ్రీధర్‌కు 2024 ఆగస్టు 22న వివాహమైంది. ఏడాది గడవకముందే శ్రీధర్ ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు కంటతడిపెట్టారు. శ్రీధర్ తండ్రి గంగారాం కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. పోలీసులు అందించిన సమాచారంతో శ్రీధర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వరంగల్‌కు తరలివెళ్లారు. అక్కడ పోలీసు అధికారులు శ్రీధర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం రాత్రి వరకు పాల్వంచకు చేరుకుంది.

లక్ష్యానికి అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు 44,655
- జూన్ 2 నాటికి రుణ మంజూరు ఉత్తర్వులు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి లక్ష్యానికి అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పథకాలపై ఎంపీడీవోలు, ఏపీవోలు, సీడీపీవోలతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం కింద 44,655 దరఖాస్తులు అందాయని, వాటిని పరిశీలించి, అర్హత మేరకు రూ.50 వేల కన్నా ఎక్కువ రుణం కోసం అందిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు రేపటి లోగా జాబితాలను పరిశీలనకు పంపించాలని అన్నారు. బ్యాంకు అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 14వ తేదీ లోగా పూర్తిచేస్తారని, 20వ తేదీ లోగా మండల కమిటీలు పరిశీలించి జిల్లా కమిటీకి పంపించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలను జిల్లా కమిటీ పరిశీలించి 30వ తేదీ లోగా జిల్లా మంత్రికి జాబితాలను మంజూరు నిమిత్తం సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. జూన్ 2 నాటికి లక్ష్యానికి అనుగుణంగా 13,450 మంది లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందించడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధి హామీ

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు చొప్పున ఫామ్‌పాండ్స్, ఇంకుడు గుంతలు తవ్వించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు, స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి రజిత, సీపీవో రాజారాం, ఎంపీడీవోలు, ఏపీవోలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు..

జిల్లాలో అర్హుల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ చేసినప్పటికీ కేవలం 25 శాతం ఇళ్ల పనులు మాత్రమే జరుగుతున్నాయని, నిర్మాణాలు ప్రారంభం కాని చోట్ల పనులు ప్రారంభించే విధంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డి , జుక్కల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కూడా ఇళ్ల మంజూరు చేస్తామని, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా పర్యవేక్షించాలన్నారు. ప్రతి రెండు మండలాలకు ఒక హౌసింగ్ ఏఈని కేటాయించామని, ఏఈలతో సమావేశాలు నిర్వహించి నిర్మాణ పనులు త్వరగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 22 మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో అడవుల విస్తీర్ణం (హెక్టార్లలో)

కామారెడ్డి	82,190.48
నిజామాబాద్	86,871.45
ఇందల్వాయి రేంజ్	22,748.41
సిరికొండ రేంజ్	15,544.71

చిరుతల మృత్యుఘోష

- తాజాగా రోడ్డు ప్రమాదంలో చిరుత మృత్యువాత
- అండర్‌పాస్‌లు లేక తరచూ ప్రమాదాలు..
- రైల్వే, హైవే, అటవీ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

డెత్‌స్పాట్‌గా మారిన ఇందల్వాయి ఫారెస్ట్



2019 మేలో రూప్లానాయక్ తండా వద్ద హైవేపై వాహనం ఢీకొని మృతిచెందిన చిరుత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ వన్యమృగాలకు డెత్ స్పాట్‌గా మారింది. దట్టమైన అటవీ ప్రాంతంలో మూగజీవాల రక్షణకు ఫారెస్ట్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా సాసర్ పిట్ల నిర్వహణ, వాటి ఏర్పాటులో అలసత్వం వన్యమృగాల పాలిట శాపంగా మారింది. దీనికితోడు అటవీ ప్రాంతంలో రైల్వేశాఖ, జాతీయ రహదారుల విభాగం అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో వన్యప్రాణులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నాయి. తాజాగా ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి శివారు 44వ నెంబర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండేళ్ల వయస్సుగల చిరుత మృత్యువాత పడింది. ఈఘటనతో హైవేలు, రైల్వేట్రాక్‌ల వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు ఇందల్వాయి రేంజ్ సదాశివనగర్, సిరికొండ రేంజ్‌కు మాచారెడ్డి మండలాలను కలుపుతూ అడవులున్నాయి. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారి, సికింద్రాబాద్ నుంచి ముంబయి వెళ్లే రైల్వే ట్రాక్ ఈ అటవీ ప్రాంతం గుండా వెళ్తుంది. వేసవిలో అటవీ ప్రాంతంలో తాగునీటి కొరత ఏర్పడడంతో వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి బయటికి వస్తుంటాయి. నీటి కోసం వెతుకుతూ హైవేలు, రైల్వేట్రాక్‌లు దాటుతుంటాయి. ఈ క్రమంలో రాత్రివేళల్లో చిరుతలు సహా ఇతర వన్యప్రాణులు, మృగాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి.

- 2018 జనవరిలో రైలు ఢీకొనడంతో సిర్నాపల్లి అటవీ ప్రాంతంలో చిరుత మృతి.
- 2019 మేలో రూప్లానాయక్ తండా వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో చిరుత మృతి.
- 2023 ఫిబ్రవరిలో చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన చిరుత.
- తాజాగా 2025 మే 7న చంద్రాయన్‌పల్లి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృత్యువాత.

శాఖల మధ్య సమన్వయ లోపం..

అటవీ ప్రాంతంలో వన్యమృగాల సంరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తద్వారా మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీటి సంరక్షణ కోసం అటవీశాఖ, రైల్వేశాఖ, జాతీయరహదారుల విభాగం సమన్వయంతో చర్యలు చేపట్టాల్సి ఉంది. వీరి మధ్య సమన్వయ లోపం కారణంగా పనులు కార్యరూపం దాల్చడంలేదు. ముఖ్యంగా రైల్వేట్రాక్, జాతీయ రహదారులకు అండర్ పాస్‌ల నిర్మాణం చేపడితే ఈ ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది. కాగా ఈ విషయమై హైవే ఈఈ మల్లారెడ్డిని వివరణ కోరగా స్పందించలేదు.

నేషనల్ హైవే అధికారులను సంప్రదిస్తున్నాం

ఇందల్వాయి, సదాశివనగర్ మధ్యలో ఉన్న నేషనల్ హైవే రహదారిపై చిరుతలు, ఇతర వన్య ప్రాణులు ప్రమాదాలకు ఎక్కువగా గురై మరణిస్తున్న విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్, రహదారి కింద అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరాం. నేషనల్ హైవే అథారిటీ సానుకూలంగా స్పందించింది.

– వికాస్ మీనా, జిల్లా అటవీశాఖ అధికారి

రేంజ్ వారీగా చిరుతలు

ఆర్మూర్	03
ఇందల్‌వాయి	30
సిరికొండ	14
నిజామాబాద్ నార్త్	15
నిజామాబాద్ సౌత్	10
కమ్మర్ పల్లి	08
వర్ని	06



● విరబూసిన అందం

బీబీపేట మండల కేంద్రం నుంచి సిరిసిల్ల జిల్లాకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన తురాయి చెట్లు విరగబూశాయి. అందాలతో కనువిందు చేస్తున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన తురాయి మొక్కలు ఏపుగా పెరిగి నీడనివ్వడంతో పాటు పూలతో కనువిందు చేస్తున్నాయి. అలాగే బిచ్కుంద నుంచి కందర్‌పల్లి వరకు, వాజిద్‌నగర్ నుంచి బండా రెంజల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నీడనివ్వడంతోపాటు ఎర్రని పూలతో ఆకర్షిస్తున్నాయి. ఈ రోడ్ల మీదుగా ప్రయాణించే వారు కొంత సేపు నీడలో ఆగి అక్కడి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

– బీబీపేట/బిచ్కుంద

ప్రయాణికురాలి బంగారం చోరీ

- హ్యాండ్‌బ్యాగ్‌లోని 8 తులాల బంగారు గొలుసు అపహరణ

కామారెడ్డి క్రైం: బస్సు ఎక్కుతుండగా హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో గురువారం రాత్రి జరిగింది. సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన శ్రీమంతుల సంధీప్త అనే మహిళ హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తూ సాయంత్రం కామారెడ్డి బస్టాండ్‌లో దిగింది. సిరికొండ బస్సు ఎక్కిన తర్వాత హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా బ్యాగ్‌లో ఉన్న ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు. బస్సు ఎక్కే క్రమంలో చోరీ జరిగినట్లు భావిస్తున్నారు. హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్న 8 తులాల బంగారు గొలుసు చోరీకి గురైందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌లో దుర్గామాత ఆలయం వద్ద శుక్రవారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. శుక్రవారం ఎడ్లబండ్ల ప్రదర్శన, శనివారం బోనాలు, ఆదివారం రథోత్సవం, సోమవారం కుస్తీ పోటీలు ఉంటాయన్నారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పొలాలకు నిప్పు భూసారానికి ముప్పు



గుండెనెమ్లిలో పొలాల్లో గడ్డిని కాల్చిన రైతులు

బిచ్కుంద: ప్రస్తుతం యాసంగిలో వరి పంటలు కోసిన రైతులు పొలాల్లో ఉన్న వరిగడ్డిని చెత్తగా భావించి నిప్పుపెట్టి కాల్చేస్తున్నారు. దీనివల్ల భూమికి ముప్పు ఏర్పడుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. బిచ్కుంద మండలంలోని ఖద్గాం, మెక్కా, శెట్లూర్, పుల్కల్, గుండెనెమ్లి, బండారెంజల్, శాంతాపూర్ గ్రామాల రైతులకు బోర్ల ద్వారా సాగునీరు అందుబాటులో ఉండడంతో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. పొలాల్లో యంత్రాలతో కోసిన గడ్డిని కాల్చడంతో వేడితో భూమిలో భూసారానికి ముప్పు వాటిల్లుతుందన్న విషయాన్ని రైతులు గమనించాలని అధికారులు పేర్కొంటున్నారు.

తాడ్వాయి ఎస్సైగా మురళి



ఎస్సై మురళి

తాడ్వాయి: తాడ్వాయి ఎస్సైగా మురళి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఉన్న రాజయ్య కామారెడ్డి కోర్టులో లైజన్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో కామారెడ్డి కోర్టులో లైజన్ ఆఫీసర్‌గా పనిచేసిన మురళి తాడ్వాయికి బదిలీపై వచ్చారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో మంటలు



పిట్లం: మండలంలోని అల్లాపూర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సాయంత్రం దుండగులు నిప్పంటించారు. దీంతో మంటలు అంటుకొని విలువైన సామగ్రి కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ అధికారులు బుధవారం ఉదయం తనిఖీ చేసి వెళ్లగా సాయంత్రం టీచర్ కేంద్రానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. దుండగులు కిటికి వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించారు. గమనించిన స్థానికులు వెంటనే నీరు పోసి మంటలను అదుపు చేశారు. కేంద్రంలోని విద్యుత్తు తీగలు, విలువైన సామగ్రి కాలిపోయాయని స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ సావిత్రి తెలిపారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన పరిస్థితి
- నిధులు లేక పూర్తి కాని నిర్మాణాలు
- అద్దె గదిలో చిన్నారుల అవస్థలు



ఇరుకు గదిలో ఉన్న చిన్నారులు



రాముల గుట్ట తండాలో నిలిచిన పనులు

నస్రుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గతంలో రూ. తొమ్మిది లక్షల నిధులు కేటాయించి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు మొదట పెట్టి ఏళ్లు గడుస్తున్నా అంగన్‌వాడీ భవనాలు మాత్రం పూర్తి కావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అద్దె భవనాల్లో..

అంగన్‌వాడీ భవనాలకు సంబంధిత కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టినా అనుకున్న ప్లాన్ ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపేశారు. దీంతో చిన్నారులు అద్దె భవనాల్లోనే చదువును కొనసాగిస్తున్నారు. పలు చోట్ల ఇరుకు గదులు, రేకుల ఇళ్లలో కాలం వెల్లదీస్తున్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, రాముల గుట్ట తండా, ఫకీరానాయక్ తండాల్లో ఉన్న కేంద్రాలు ప్రారంభించి మధ్యలోనే నిలిపేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో మందు బాబులకు అడ్డాగా, అసాంఘిక కార్యాకలాపాలకు నిలయంగా మారింది. శాశ్వత భవన పనులు పూర్తి కాకపోవడంతో చిన్నారులు అద్దె భవనంలో ఇరుకు గదులలో అవస్థలు పడుతున్నారు. నిధులను కేటాయించి పనులు మొదలు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులను పూర్తి చేయాలి

చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇరుకు గదుల్లో ఉంటున్నా అధికారులకు స్పందించడం లేదు. సరైన భవనాలు లేక అంగన్‌వాడీ సరుకులు సైతం ఎలుకలకు ఆహారంగా మారుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు చేపట్టాలి.

– పుట్ట భాస్కర్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు

సిద్ధరామేశ్వర ఆలయ అక్రమాలపై విచారణ చేపట్టాలి



దేవాదాయశాఖమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని వెంటనే విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు గురువారం వినతి పత్రం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, కాంగ్రెస్ మండల నేతలు అందె దయాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, నీల అంజయ్య నర్మల రాంచంద్రం, మద్దురి రవి, జనార్దన్‌రెడ్డి, రాజు హైదారాబాద్‌లో మంత్రిని కలిసి ఆలయంలో పలువురు తీరుపై ఫిర్యాదు చేశారు.

ఆలయంలో హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి ప్రదర్శించిన చేతివాటంపై ఆలయ ఈవో అతనిని సహకరిస్తున్నారని ఈ విషయమై తగు విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం మంత్రిని నాయకులు సన్మానించారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



నర్సింలు శ్రీకాంత్, కొండా అనిల్ గుప్తా



రాంరెడ్డి

ఎల్లారెడ్డి/ నిజాంసాగర్/ సదాశివనగర్: జిల్లాలోని పలు మండలాల బీజేపీ నూతన అధ్యక్షులను పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు నియమించి ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఎల్లారెడ్డి రూరల్ మండల అధ్యక్షుడిగా పెద్దెడ్ల నర్సింలు, మహమ్మద్‌నగర్ మండల అధ్యక్షుడిగా దమనబోయిన శ్రీకాంత్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కొండా అనిల్ గుప్తా, సదాశివనగర్ మండలం అధ్యక్షుడిగా కుంట రాంరెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్ రైతు వేదికలో గురువారం నిర్వహించిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన వంగడాలు, సుస్థిర వ్యవసాయం, పంటలలో వ్యాపించే చీడపీడలు, వాటినివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటలు సాగు చేసే ముందు విత్తనాల రకాలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి తదితర వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడొద్దని, అవసరం మేరకే ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేసినట్లయితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు పొందొచ్చన్నారు. వ్యవసాయ అధికారుల సలహా మేరకు పంటలకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం మాల్తుమ్మెద శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, సహాయ సంచాలకులు రత్న, మండల వ్యవసాయ అధికారి నర్సింలు, విస్తరణాధికారులు శ్రావణ్‌కుమార్, అశోక్‌రెడ్డి, శివ, చైతన్య, సతీశ్, హారిక, రైతులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ ముఖ్యమైంది



మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్ రావు

డొంకేశ్వర్(ఆర్మూర్): సొసైటీలో సహకార సంఘాల వ్యవస్థ, పాత్ర ముఖ్యమైనదిగా మారిందని డీసీవో శ్రీనివాస్ రావు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ భవనంలో సమావేశం నిర్వహించారు. డీసీవో ముఖ్య అతిథిగా హాజరై, సహకార చట్టం, పాలనపై సభ్యులకు అవగాహన కల్పించారు. సొసైటీ సభ్యులు శంకర్‌రెడ్డి, దత్తాత్రేయ, ప్రభాకర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ప్రజలు తమ ఇళ్లపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన కింద 'మోడల్ సోలార్ విలేజ్' అమలు కోసం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ పథకంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ ఎంపిక కోసం డిస్ట్రిక్ లెవెల్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర నిధులతో ఎంపిక చేయబడ్డ గ్రామంలో ప్రభుత్వ భవనాలకు, స్ట్రీట్ లైట్లకు వాటర్ పంప్ సెట్స్ లకు సోలార్ సిస్టంలను ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లాలో ఐదు వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన తడుకోల్, భిక్కనూరు, జంగంపల్లి, పెద్ద మల్లారెడ్డి, బీబీపేట్, బీర్కూర్, దోమకొండ, గాంధారి, జుక్కల్, చిన్న మల్లారెడ్డి, లింగంపేట్, మద్నూర్, పిట్లం, రాజంపేట, రామారెడ్డి, అడ్లూరు ఎల్లారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి గ్రామాలను ఎంపిక చేసామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, రెడ్కో జిల్లా మేనేజర్ రమణ, ఎంపీడీవోలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం పరిశీలించారు. రూ. 5 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగా గోదాంను సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. భద్రతపై పలు సూచనలు చేశారు. ఆయనవెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, డీటీ అనిల్ తదితరులున్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన 2003–04 బ్యాచ్ పూర్వ గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మిత్రులందరూ ఒకే చోట చేరడంతో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుకులాల మాజీ రీజినల్ కో–ఆర్డినేటర్ తులసీదాస్, అధ్యాపకులు ఉదయభాస్కర్, నగేశ్, రమేశ్, విజయ్ కుమార్, రాంచంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శివరాం పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అందిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మండలంలోని పొల్కంపేట, పర్మళ్ల, శెట్పల్లి, శెట్పల్లిసంగారెడ్డి, భవానిపేట ముంబోజీపేట గ్రామాల్లో గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో మాట్లాడారు. భూ భారతి చట్ట ప్రకారం రైతులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న భూ వివాదాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. రైతులు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్, పాల్గొన్న ఇంటర్ అధికారి రవికుమార్

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను భారీగా పెంచడానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలు, బడుల్లో అడ్మిషన్లను పెంచడంతోపాటు, రానున్న సప్లిమెంటరీ పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని హెచ్ఎం, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఫలితాల సాధనలో 90 రోజుల ప్రణాళికలను అమలు చేశామని అలాగే ప్రస్తుత సప్లిమెంటరీ పరీక్షలకు 15 రోజుల ప్రణాళిక ద్వారా 100 శాతం ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్ సౌకర్యం లేదని, మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపినట్లయితే అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వ అనుమతి లేని కళాశాలలో విద్యార్థులను చేర్పించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లావిద్యాశాఖ అధికారి అశోక్, ఆర్టీసీ అధికారులు, ఫైర్ ఆఫీసర్, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్ సంబంధిత అధికారులు, జిల్లా ఇంటర్ విద్య పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండల కేంద్రంలో రెండు పేకాట స్థావరాలపై దాడి చేసి, పేకాడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. డోంగ్లీలోని మొదటి పేకాట స్థావరంపై దాడిచేసి రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకొని, ఐదుగురిని పట్టుకున్నామన్నారు. అనంతరం మరో స్థావరంపై దాడి చేసి మరో ఐదుగురు వ్యక్తులను పట్టు కొని, వారి వద్ద నుంచి రూ.13వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైం: పట్టణంలోని జయశంకర్ కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు.వారి నుంచి రూ. 6,200 నగదు, 4బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.కేసునమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

లైసెన్స్‌డ్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: లైసెన్స్‌డ్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీ సేవా కేంద్రాల్లో ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో అర్హత కలిగిన సర్వేయర్లు సరిపడా సంఖ్యలో లేనందున, 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లైసెన్స్ సర్వేయర్‌గా ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 17.05.2025 నాటికి ఓసీ, బీసీలు అయితే 18 నుంచి 35 సంవత్సరాల లోపు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు, ఇంటర్, డిప్లొమా సివిల్ ట్రేడ్, వొకేషనల్, నిర్దేశిత కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు.

బోనం ఎత్తిన పల్లె



బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నిజాంసాగర్: అమ్మ బైలెల్లినాదో.. తల్లీ బైలెల్లినాదో అంటూ శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో బోనాల ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. బేస్త సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాల జాతర చేపట్టారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, రమేశ్, కుపేందర్, సాయిలు, గోవింద్, విఠల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యం

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ము రేవతి తన కొడుకు శ్రేయస్‌తో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై రామ్ తెలిపారు. గత నెల 30న రేవతి తన కొడుకుతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటివరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంతవెతికినా వారి ఆచూకీ లభించ లేదు. దీంతో ఆమె భర్త జలంధర్ పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్రైం కార్నర్

లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో ప్రమాదం: ఒకరి మృతి



వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూరు మండలం కారేగాం తండా వద్ద కొనసాగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో ప్రమాదం జరగడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండి సాజీద్ (19) ఉపాధి నిమిత్తం లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో చేరాడు. బుధవారం రాత్రి లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా క్రేన్‌తో పైపులు వేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ వైరు తెగిపోయి పైపులు కార్మికులపై పడ్డాయి. ఈ ఘటనలో సాజీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఆస్పత్రిలో బాలింత మృతి



సునంద (ఫైల్)

కామారెడ్డి రూరల్: మధ్యాహ్నం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి రాత్రికి కన్నుమూసింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన దుమాల సునంద–మల్లేష్ దంపతులకు మొదటి కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రెండవ సారి గర్భం దాల్చిన సునంద బుధవారం డెలివరీ కోసం నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. మధ్యాహ్నం పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. రాత్రి వరకు కుటుంబ సభ్యులతో బాగానే మాట్లాడిన సునందకు అర్ధరాత్రి దమ్ము ఎక్కువైంది. ఆమెను బతికించేందుకు వైద్యులు శతవిధాల ప్రయత్నించినా ఫలించలేదు. అర గంటలోనే ఆమె మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యింది. బిడ్డను కళ్లారా తనివితీరా చూసుకోకుండానే మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సునంద మృతి చెందడంతో ఆమె కూతురు అక్షమాల, భర్త మల్లేష్, పుట్టిన బాలుడి పరిస్థితి ఏమిటోనని గ్రామస్తులు రోదించారు.

పూడ్చిన మృతదేహానికి పంచనామా

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో 13రోజుల కిందట పూడ్చిన ఓ వ్యక్తి మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇ లా.. అదే గ్రామానికి చెందిన వ్యక్తి(58) గత నెల 25న మృతి చెందడంతో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి చిన్న కుమారుడు ఈనెల 7న పీఎస్‌కు వచ్చి, తన తండ్రి మరణంపై అనుమానం ఉందని, ఒక వ్యక్తి తీవ్రంగా కొట్టడంతో ఆ దెబ్బలకు చనిపోయాడని ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ వెంకటరమణ, ఎస్సై వినయ్‌ల ఆధ్వర్యంలో గురువారం పూడ్చిన శవాన్ని వెలికితీసి అక్కడే జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వైద్యులు పోస్ట్‌మార్టం చేశారు. వైద్య పరీక్ష ఫలితాలు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాలు ఇలా.. పచ్చలనడ్కుడకు చెందిన ఆర్మూర్ రుకుంబాయి ఈనెల 5న ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌కు వెళ్లింది. గురువారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకొని, పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి, బీరువాలోని సుమారు 8 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు నిందితుల రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముగ్గురు నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. మాలోత్ తండాకు చెందిన మాలోత్ రవి, నల్లమడుగు చిన్నతండాకు చెందిన మాలోత్ గోపాల్‌చ, ముంబోజీపేట తండాకు చెందిన గుగులోత్ సురేష్‌లపై కేసులున్నట్లు తెలిపారు. వీరు కోర్టుకు హాజరు కానందున నాన్ బెయిలేబుల్ వారెంట్ జారీ చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు నాన్ బెయిలేబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇకముందు ఎవరైనా కోర్టుకు హాజరు కాకుండా వారెంటు జారీ అయితే రిమాండుకు తరలిస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

సిరికొండ: మండలంలోని పాకాల గ్రామంలో బాదావత్ శ్రీనివాస్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమీప పొలాల్లో మేతమేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ 50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

పెద్ద వాల్గోట్ గ్రామంలో ఆవు..

సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ శివారులో కృష్ణ మందిరానికి చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో ఈ నెల 4న మృతి చెందినట్లు ఆలయ ప్రభూజి గురువారం తెలిపారు. మందిరం సమీపంలోని పొలాల్లో మేతమేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆవు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని ఆలయ ప్రభూజి తెలిపారు.